

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

గుడిసెలు వేసుకున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. 10లో▸



రైతుల న్యాయం కోసమే..

రైతుల సమస్యల పరిష్కారానికే వ్యవసాయ న్యాయ సేవా సలహా కేంద్రాన్ని ప్రారంభించినట్లు జడ్జి ఇందిర అన్నారు. 10లో▸



కాల్వలో పడిపోయిన లారీ

అధిక బరువుతో వచ్చిన వరి ధాన్యం లారీ ఉప్పరిగూడ సమీపంలో రాచకాల్వలో పడిపోయింది. 10లో▸

న్యూస్‌రీల్

ఆసరా పింఛన్లకు నిధులు విడుదల



తుక్కుగూడ: ఆసరా పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం ఈనెల నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ హరీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు సమీపంలోని తపాలా కార్యాలయంలో ఈనెల 30వ తేదీలోపు పింఛన్ డబ్బులు తీసుకోవాలని సూచించారు.

నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ కె.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో బైక్ మెకానిక్, సెల్‌ఫోన్ రిపేరింగ్, సీసీటీవీ కెమెరా సర్వీసింగ్ కోర్సుల్లో జూలై 3 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి పాసైన యువకులు ఈ నెల 24 నుంచి జూలై 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతోపాటు ఎస్ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతచేయాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యంతోపాటు యూనిఫాం, టూల్ కిట్స్ ఉచితంగా అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 86390 79122, 79819 51167, 90007 78300 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని శాత్రజిపల్లి రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం నాగర్‌కర్నూల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం బీఎస్సీ (హన్స్) డిజైన్, టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్, వొకేషనల్ (సీజీటీ) పూర్తి చేసిన విద్యార్థినులు, ఫ్యాషన్ రంగంలో ఆసక్తి కలిగిన వారు వేములవాడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 28న ముగియనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 76758 97485, 90596 63002 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకోసం దరఖాస్తు చేసుకోవాలని చేవెళ్లలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ షేక్ మహబూబ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో 2023–24 విద్యాసంవత్సరానికిగాను బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం డిగ్రీ ప్రోగ్రాం మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జూలై 31 చివరి తేదీ అని, ఇంటర్ పాస్, ఇంటర్‌కు సమానమైన విద్యార్హతలు కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 99086 40914 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) వికారాబాద్‌లో తాత్కాలిక పద్ధతిన అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హత గల నిరుద్యోగ అభ్యర్థులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అధ్యాపకులకు రూ.18వేలు, ఆర్ట్స్ ఎడ్యుకేషన్ అధ్యాపకులకు రూ.12వేలు వేతనం ఉంటుందని తెలిపారు.తెలుగు,ఇంగ్లిష్ మీడియంలో ఫిలాసఫీ, సోషియాలజీ, సైకాలజీ, సైన్స్, మేథమటిక్స్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విజువల్ ఆర్ట్స్ ఉర్దూమీడియంలో బోధించేందుకు మొత్తం 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, ఎంఈడీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు.అభ్యర్థులు బయోడేటాతో పాటు ధ్రువపత్రాల జిరాక్స్‌లు ఈనెల 30వ తేదీలోగా వికారాబాద్‌లో సమర్పించాలని సూచించారు.

సర్కార్ భూమిపై కన్ను

- మొండిగౌరెల్లిలోని సర్వే నంబర్ 127లో అడ్డగోలు విక్రయాలు
- ఎకరాల్లో అసైన్డ్ భూమి.. నోటరీ ద్వారా గుంటల్లో అమ్మకాలు
- గుట్టుగా నిర్మాణాలు.. 58, 59 జీవోల కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు
- ఆక్రమణలపై ఎమ్మెల్యే, కలెక్టర్ సీరియస్



మొండిగౌరెల్లిలోని సర్వే నంబరు 127 ప్రభుత్వ భూమిలో నిర్మించినట్లు గుర్తించిన ఓ బంగ్లా



మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వే నంబరులో అక్రమార్కులు వేసిన రోడ్డు

యాచారం: ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా ప్లాట్లు చేసి గుట్టుగా విక్రయానికి పెట్టారు. విషయం తెలియక ఇప్పటికే భూములు కొనుగోలు చేసిన వారు సైతం వాటిలో రాత్రికిరాత్రే నిర్మాణాలు చేపట్టి క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్ 58, 59 కింద ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని మొండిగౌరెల్లి రెవెన్యూ కేంద్రంగా జరుగుతున్న రూ.10 కోట్ల విలువ చేసే భూ ఆక్రమణలపై ప్రత్యేక కథనం.

ఆక్రమించి.. నకిలీ ఓఆర్‌సీలు సృష్టించి..

నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారి పక్కన మొండిగౌరెల్లి రెవెన్యూ పరిధిలో యాచారం–మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లితండా గ్రామాల మధ్యన సర్వే నంబర్ 127లో 122 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వం అరవై ఏళ్ల క్రితం సుమారు 30 మంది రైతులకు 108 ఎకరాలు అసైన్డ్ చేసింది. నిరుపేదలకు అసైన్డ్ చేయగా మిగిలిన 13.12 ఎకరాలపై స్థానిక నేతల కన్ను పడింది. ధరణికి ముందే నకిలీ ఓఆర్‌సీలు సృష్టించి, తమ పేరున లావణి పట్టా చేసుకున్నట్లు తెలిసింది. ఇలా సొంతం చేసుకున్న భూమిలో అనధికారికంగా రోడ్లు వేశారు. 200, 500 గజాల చొప్పున ప్లాట్లు చేసి గుట్టుగా నోటరీ ద్వారా అమ్మకానికి పెట్టారు. గజం రూ.5000పైగా ధర నిర్ణయించారు. కొనుగోలు చేసిన వారు ఆయా భూముల్లో నిర్మాణాలు చేపట్టారు. మొండిగౌరెల్లి రెవెన్యూ పరిధి లోని అసైన్డ్ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలకు యాచారం పంచాయతీ నుంచి ఇంటి నంబర్ సహా ఇంటి పన్ను చెల్లింపు రసీదులు పొందారు. ఆయా నిర్మాణాలను క్రమబద్ధీకరించాల్సింది గా కోరుతూ ప్రభుత్వానికి ఇటీవల దరఖాస్తు కూడా చేసుకోవడం విశేషం.

ఫిర్యాదులు రావడంతో..

మొండిగౌరెల్లిలో అక్రమ ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు రెవెన్యూ అధికారులకు ఇటీవల ఫిర్యాదులు అందాయి. దీంతో వారు మూడు రోజుల క్రితం పోలీసుల సాయంతో 127 సర్వే నంబర్‌ను పరిశీలించారు. సదరు సర్వే నంబర్‌లో అక్రమ ఇళ్ల నిర్మాణాలున్నట్లు గుర్తించి, ఈ మేరకు రెండు నిర్మాణాలను కూల్చేశారు. నిర్మాణాలు కూల్చొద్దని పేర్కొంటూ అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే సహా ఎమ్మెల్సీ, ఓ సీనియర్ మంత్రి పీఏ నుంచి అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయి. అయినా తహసీల్దార్ అక్రమ ఇంటి నిర్మాణాలను కూల్చేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహా కలెక్టర్ హరీశ్ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ భూములు పట్టా భూములుగా ఎలా మారాయి? వాటికి పాసు పుస్తకాలు ఎలా జారీ అయ్యాయి? భూ కబ్జాకు ఏ ఏ ప్రభుత్వ అధికారి సహకరించారు? కబ్జాల వెనుక ఎవరి హస్తం ఉంది? వంటి అంశాలపై కలెక్టర్ హరీశ్ ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

నకిలీలను గుర్తించాలి



నకిలీలను గుర్తించాలి. నిజమైన అసైన్డ్ దారులకు న్యాయం చేయాలి. కొంత మంది రైతులకు అసైన్డ్ పట్టాలు ఉన్న ధరణిలో నమోదు కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలి. ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే అధికారులు ఇన్నాళ్లు ఏం చేస్తున్నట్లు? ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలి.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

అక్రమార్కులను వదిలేదే లేదు



సర్వే నంబర్ 127లోని భూమిని మొత్తం సర్వే చేస్తున్నాం. నిజమైన అసైన్డ్‌దారులను గుర్తించాం. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం. ఇప్పటికే రెండు ఇళ్లను కూల్చేశాం. కొన్ని ఇళ్లకు మొండిగౌరెల్లి పంచాయతీ నుంచి అనుమతులు పొందినట్లు ఫిర్యాదులు అందాయి. ఆ సర్టిఫికెట్లను పరిశీలిస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి కూల్చేస్తాం.

– సుచరిత, తహసీల్దార్, యాచారం

'లక్ష్మీదేవిపల్లి'ని సాధించుకుందాం

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాఘవాచారి పిలుపు



సభలో మాట్లాడుతున్న రాఘవాచారి

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపడితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలని కోరుతూ కొంత కాలంగా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నవచైతన్య సమితి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుప్పుడు నర్సయ్య ఆధ్వర్యంలో 'జలగోస' కవి సభను నిర్వహించారు. పలువురు కవులు తమ కవితల ద్వారా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఆవశ్యకతను వివరించారు. అనంతరం రాఘవాచారి మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష అని, కొట్లాడి సాధించుకొని కలను నిజం చేసుకుందామని పిలుపునిచ్చారు. రిజర్వాయర్ నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందుతుందని, పంటలు బాగా పండి ప్రజలు సుభిక్షంగా ఉంటారని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఈ ప్రాంత రైతులు, ప్రజల ఆకాంక్షను దృష్టిలో పెట్టుకొని లక్ష్మీదేవిపల్లిని వెంటనే నిర్మించాలని, అప్పటి వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, అర్జునప్ప, రవీంద్రనాథ్, సర్వరాజ్, వెంకట్‌రెడ్డి, కృష్ణ, శివారెడ్డి, రవికుమార్, తుప్పుడు అంజమ్మ, రాంచందర్, వెంకటేశ్వర్లు, వీర్లపల్లి శంకర్, ఎండీ ఇబ్రహీం, బాబర్ అలీఖాన్, నరసయ్య, సత్యం, నర్సింలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కుటుంబపాలన



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ఇబ్రహీంపట్నం: తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలన అవినీతిమయంగా మారిందని, కుటుంబ పాలన కొనసాగుతోందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తొమ్మిదేండ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన్ సంపర్క్ యోజనలో భాగంగా మోర్చాలా సంయుక్త సమ్మేళనాన్ని శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జోషి మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబం అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేంద్రానికి చెల్లించే టాక్స్‌ల కంటే రెట్టింపు నిధులను తెలంగాణకు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి మనిషికి 5 కిలోల చొప్పున సబ్సిడీ బియ్యం కేంద్రం ఇస్తున్న సంగతి ఇక్కడి సామాన్య ప్రజలకు తెలియదన్నారు. రోడ్లకు వేలాది కోట్లు ఇచ్చామని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆయుష్మాన్ భారత్, రైతులకు సబ్సిడీపై ఎరువులతోపాటు పలు సంక్షేమ పథకాలను కేంద్రం ప్రజలకు అందజేస్తుందన్నారు. ఈ విషయాన్ని బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని జాగృతం చేయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒకే నాణేం లాంటివన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చేందుకే కాంగ్రెస్ చూస్తుందన్నారు. 2014, 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్ గూటికి చేరిన అంశాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, యాచారం ఎంపీపీ సుకన్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితోపాటు పోరెడ్డి నర్సింహారెడ్డి, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, ముత్యాల బాస్కర్, యాదగిరిరెడ్డి, కొత్త అశోక్‌గౌడ్, లచ్చిరెడ్డి, రమేష్, నాయిని సత్యనారాయణ, మర్పల్లి అంజయ్యయాదవ్, యాదీష్, దండెం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి పెద్దమ్మతల్లి శాకంబరి ఉత్సవాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజుల పాటు శాకంబరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఏటా ఆషాఢంలో జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉద యం 3 గంటలకు అభిషేకంతో వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ నెల 26న సోమవారం ఉదయం సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నారు. 27వ తేదీన నవగ్రహ హోమం, రుద్రచండీ హోమా లు, పూర్ణాహుతి వైభవంగా నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు దేవస్థానంలో అలంకరణ కోసం వినియోగించిన కూరగాయలను భక్తులకు వితరణ చేస్తారు. వేడుకల కోసం ఆలయాన్ని రంగురంగుల పూల దండలు, వివిధ రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

గురునానక్ వద్ద పోలీసు పహారా



గురునానక్ కళాశాల వద్ద మోహరించిన పోలీసు

ఇబ్రహీంపట్నం: గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం పోలీసులు పహారా కాస్తున్నారు. యూనివర్సిటీ పేరుతో మోసం చేశారని గురువారం కళాశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి నేతలు ఆందోళన చేయడం..ఉద్రిక్త పరిస్థితులు నెలకొని లాఠీచార్జి వరకు వెళ్లడం, అరెస్టులు చేయడం తెలిసిందే.ఈ నేపథ్యంలో మళ్లీ ఏమైన ఆందోళన కార్యక్రమాలు చోటు చేసుకుంటాయోనన్న ఉద్దేశంతో పోలీసు బలగాలనుమోహరించారు.మరోవైపు యాజమాన్యం బౌన్సర్లను పెట్టుకోవడం గమనార్హం.

అండగా ఉంటాం

ఇబ్రహీంపట్నం: యూనివర్సిటీ పేరుతో మోసానికి గురైన విద్యార్థులు, పేరెంట్స్‌కు అండగా ఉంటామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ కళాశాల వద్ద గురువారం జరిగిన ఆందోళనలో అరెస్టై బెయిల్‌పై విడుదలైన ఆయన స్థానిక డాగ్ బంగ్లా వద్ద మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూనివర్సిటీ పేరుతో విద్యార్థులను కళాశాలలో చేర్చుకొని తీరా అనుమతి రాలేదంటూ మోసం చేసిన యాజమాన్యాన్ని 60 రోజు లుగా ప్రశ్నిస్తున్నా, పోలీసులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదన్నారు. మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి విద్యార్థుల భవిష్యత్తుపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

ఇబ్రహీంపట్నం: యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాన్ని అరెస్టు చేయాల ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గురునానక్ కళాశాలను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తప్పు చేసిన యాజమాన్యాన్ని వదలిపెట్టి కన్నబిడ్డల భవిష్యత్తు కోసం ఆందోళనకు దిగిన తల్లిదండ్రులపై వారికి మద్దతుగా వచ్చిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌తోపాటు పలువురిపై లాఠీలు ఝుళిపించి అరెస్టులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వారం రోజుల్లో విద్యార్థులకు న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, మంఖాల దాసు, ఆకుల ఆనంద్‌కుమార్, రవీందర్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, సుబ్బురి పాండు పాల్గొన్నారు.

శివార్లకు 'మెట్రో' జోష్!

బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్, ఎల్‌బీనగర్-నాగోల్ మధ్య ఇప్పటికే ప్రతిపాదనలు

శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరాన్ని మెట్రో రైలు మరింత పరుగులు పెట్టిస్తోంది. ఇప్పటికే రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు రూ.6 వేల కోట్లకు పైగా అంచనాలతో చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ వే పనులు వేగంగా కొనసాగుతుండగా మరిన్ని మార్గాల్లో మెట్రో విస్తరణపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వం స్వయంగా కొత్త రూట్‌లలో మెట్రో ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తోంది. మరోవైపు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి సైతం మెట్రో కోసం వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే ప్రతిపాదించిన రూట్‌లతో పాటు మరిన్ని మార్గాలకు మెట్రో రైలును విస్తరిస్తే ఔటర్ వెలుపల సైతం నగరం భారీగా విస్తరించనుంది.



- తాజాగా శంషాబాద్–తుక్కుగూడ రూట్‌పై దృష్టి
- ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్‌కు విస్తరణపై వినతులు
- కిలోమీటర్‌కు రూ.200 కోట్లు ఖర్చవుతుందంటున్న నిపుణులు
- రూ.6000 కోట్లతో ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టు

సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్‌పోర్టు మెట్రో విస్తరణ వల్ల జీవో 111 ప్రాంతాలకు కొత్తగా మెట్రో రైలు అందుబాటులోకి వస్తుంది. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తుక్కుగూడ వరకు మెట్రో రైలును పొడిగిస్తే ఎయిర్‌పోర్టును ఆనుకొని ఉన్న ఏరోసిటీతో పాటు తుక్కుగూడ పారిశ్రామిక ప్రాంతాలకు మెట్రో సదుపాయం లభించనుంది. ప్రభుత్వం ఇప్పటికే బీహెచ్ఎల్ నుంచి లక్డీకాపూల్ వరకు విస్తరణకు ప్రతిపాదించింది. ఎల్‌బీనగర్ నుంచి నాగోల్ వరకు పూర్తి చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. కేంద్రం నుంచి నిధులు లభించకపోవడం వల్ల ఈ రెండు కారిడార్‌లపైన సమగ్ర నివేదికలు సిద్ధం చేసినప్పటికీ ప్రాజెక్టు ముందుకు కదల్లేదు. కానీ ఈ మార్గాలు కూడా పూర్తయితే బీహెచ్ఎల్ నుంచి పటాన్‌చెరు వరకు, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రోను పొడిగించవచ్చు. దీంతో హైదరాబాద్ నలువైపులా మెట్రో రైలు పరుగులు పెట్టనుంది. వివిధ మార్గాల్లో మెట్రో విస్తరణకు ఇప్పుడు ఉన్న అంచనాల మేరకు లెక్కలు వేసినా కనీసం రూ.25 వేల కోట్లకు పైగా కావచ్చునని నిపుణులు చెబుతున్నారు.ఒక కిలోమీటర్ మెట్రో నిర్మాణానికి రూ.200 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా.

డీపీఆర్ రెడీ..

మెట్రో రైల్ కారిడార్–2లో భాగంగా ప్రభుత్వం బీహెచ్ఈఎల్–లక్డీకాపూల్, ఎల్‌బీనగర్–నాగోల్ కారిడార్‌లను ఎంపిక చేసింది. వయబుల్ గ్యాప్ ఫండింగ్ పథకం కింద (వీజీఎఫ్ స్కీమ్) ఈ ప్రాజెక్టు కోసం నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు బీహెచ్ఎల్ నుంచి లక్డీకాపూల్ వరకు 26 కిలోమీటర్ల మార్గంలో 23 స్టేషన్లు, నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు 5 కిలోమీటర్ల మార్గంలో 4 స్టేషన్లు కొత్తగా అందుబాటులోకి రానున్నాయి. ఈ రెండు మార్గాలపైన సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్)కూడా ప్రభుత్వం రూపొందించింది. కానీ ఇప్పటి వరకు కేంద్రం ఈ ప్రాజెక్టు కోసం నిధులు కేటాయించకపోవడం వల్లనే పనులు ప్రారంభం కాలేదు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఈ రెండు మార్గాలను చేపట్టేందుకు సుమారు రూ.8453 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. ఈ రెండు కారిడార్‌లు పూర్తి చేస్తే మరో 31 కిలోమీటర్‌లు కొత్తగా అందుబాటులోకి రానుంది. దీంతో ఎల్‌బీనగర్, నాగోల్, ఉప్పల్ తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు నేరుగా బీహెచ్ఈఎల్ వరకు రాకపోకలు సాగించగలుగుతారు.

తుక్కుగూడ విస్తరణకు ప్రతిపాదనలు...

మరోవైపు ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ వేను అక్కడి నుంచి తుక్కుగూడ వరకు మరో 20 కిలోమీటర్‌ల వరకు పొడిగించేందుకు ప్రభుత్వం సైతం సంసిద్ధంగా ఉంది. ఈ రూట్‌పైన స్థానికంగా కూడా వినతులు వెల్లువెత్తాయి. కొత్తగా చేపట్టిన ఫాక్స్‌కాన్ వరకు మెట్రో సదుపాయం అందుబాటులోకి రావడం వల్ల వేలాది మంది ఉద్యోగులకు ఎంతో ఊరట లభిస్తుంది.

వడివడిగా ఎయిర్‌పోర్టు మెట్రో..

రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 21 కిలోమీటర్ల మార్గంలో చేపట్టిన ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పెగ్‌మార్కింగ్, అలైన్‌మెంట్ పనులు పూర్తయ్యాయి. భూసారపరీక్షలు సైతం త్వరలో పూర్తికానున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే గ్లోబల్ టెండర్‌లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన ప్రీబిడ్ సమావేశంలో పలు అంతర్జాతీయ సంస్థలు తమ ఆసక్తిని ప్రదర్శించాయి. జూలై 5వ తేదీతో టెండర్ గడువు ముగియనుంది. టెండర్లను దక్కించుకున్న సంస్థ వెంటనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది. రానున్న మూడేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఊరెళ్లి వచ్చేసరికి ఊడ్చుకెళ్లారు



పగిలి ఉన్న ఇంటి గొళ్లెం

మీర్‌పేట: ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం .. బడంగ్‌పేట వెంకటాద్రి నివాస్‌కు చెందిన ఎస్.వెంకటప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈ నెల 21న పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామానికి వెళ్లి 22న సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి బీరువా తెరిచి చూడగా 12 తులాల బంగారు ఆభరణాలు, 5 తులాల వెండి, రూ.15 వేల నగదు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు



ఆమనగల్లు: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైం కంట్రోల్ బ్యూరో(ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన డి. ఆంజనేయులును నియమించారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ జాతీయ అధ్యక్షుడు రణధీర్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రణధీర్‌కుమార్‌కు ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి



చేవెళ్ల: ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



శంకర్‌పల్లి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల ధర్నా

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

చేవెళ్ల: గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. చేవెళ్లలో శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో పేదలతో కలిసి ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని సర్వే నంబర్ 75 ప్రభుత్వ భూమిలో ఉన్న నాలుగు ఎకరాల భూమిలో పేదలు గుడిసెలు వేసుకొని 130 రోజులుగా పోరాటం చేస్తున్నారన్నారు. వారి గోడును ప్రభుత్వాలు, ఎమ్మెల్యే పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. పేదలకు న్యాయం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అడిగితే ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. లక్షరూపాయల ఆర్థిక సాయం అందిస్తామని బీసీలకు ఆశ చూపించి దశాబ్ది ఉత్సవాల పేరుతో అధికారులు అందుబాటులో లేకుండా చేసిందని దుయ్యబట్టారు. కనీసం గడువు పొడిగించకుండా ఇబ్బందులకు గురి చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అందరికీ లక్షరూపాయల సహాయం అందించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రామస్వామి, ఎం.ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, సుభాన్ రెడ్డి, సత్యనారాయణ, సత్తిరెడ్డి, ఎం.డీ మక్బూల్, కె. శ్రీనివాస్, ఎస్. జంగయ్య, సుధీర్, శౌరీ, అంజయ్య, మల్లేశ్, మంజుల, విజయమ్మ, సాయిలమ్మ, శివ, శ్రీను పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

శంకర్‌పల్లి: అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను, ఖాళీస్థలాలను ప్రభుత్వం అందించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు ఇళ్ల లేక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ఏళ్లుగా శంకర్‌పల్లిలో నివాసం ఉంటున్నా కనీసం ఓటరు గుర్తింపు కార్డు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు నర్సింహ, సురేష్, కమ్మరి సత్యం, పద్మ, రాధ, అయేషా బేగం, ఇందిరమ్మ, సుజాత పాల్గొన్నారు.

రైతుల కోసమే న్యాయసలహా కేంద్రం

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిర



మాట్లాడుతున్న సివిల్ జడ్జి ఇందిర

ఆమనగల్లు: రైతులు తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకోవడానికే వ్యవసాయ న్యాయ సేవా సలహా కేంద్రాన్ని ప్రారంభించినట్లు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదిక భవనంలోని వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలకు సంబంధించి వచ్చిన పది పిటిషన్లను స్వీకరించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో జడ్జి ఇందిర మాట్లాడుతూ.. రైతులకు న్యాయపరమైన సమస్యలుంటే పరిష్కరించుకోవడానికి సేవా కేంద్రం ఉపయోగపడుతుందని చెప్పారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులకు సంబంధించి రసీదులు విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నిట్టి నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుజాత, తహసీల్దార్ జ్యోతి, ఎస్ఐ సుందరయ్య, ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, మార్కెట్ కార్యదర్శి సరోజ, ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఏఈఓలు రాణి, నిఖిత, శివతేజ, సాయిరాం, బాల్‌రెడ్డి, శ్రీలత పాల్గొన్నారు.

కాల్వలో పడిపోయిన లారీ

గంటల తరబడి నిలిచిపోయిన రాకపోకలు

ఇబ్రహీంపట్నం రూరల్: త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం అధిక బరువుతో వచ్చిన వరి ధాన్యం లారీ ఉప్పరిగూడ సమీపంలో రాచకాల్వలో పడిపోయింది. డ్రైవర్, క్లీనర్ ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడ్డారు. ఉప్పరిగూడ గ్రామానికి గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. ధాన్యం గంగపాలైంది. గత సంవత్సరం విస్తరంగా కురిసిన వర్షాలకు ఇప్పటికీ కాల్వలో నీరు అలాగే నిలిచి ఉంది. వంతెన కుంగిపోయి పూర్తిగా ధ్వంసమైంది. బ్రిడ్జి వేయాలని పెద్ద ఎత్తున ఆందోళన చేసినప్పటికీ సీసీ రోడ్డుతో సరిపెడుతున్నారని, ఇప్పటికైనా బ్రిడ్జి వేయాలని స్థానికులు కోరుతున్నారు.



కాల్వ నీటిలో లారీ

ఆత్మరక్షణకు కరాటే దోహదం

హుడాకాంప్లెక్స్: ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని కరాటే లెజెండ్, సినీ నటుడు సుమన్ అన్నారు. సరూర్‌నగర్‌లోని జేఎస్‌ఏఎస్ అకాడమీలో శిక్షణ పొంది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డీ.కార్తిక్, సాయి హర్షిత్, పి.సుశాంత్‌కు శుక్రవారం బ్లాక్ బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. శిక్షణ ఇస్తున్న జేఎస్ఏఎస్ అకాడమీ చీఫ్ శివకుమార్‌ను ఆయన అభినందించారు.



శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సినీ నటుడు సుమన్

గురునానక్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: గురునానక్ కళాశాల గుర్తింపు రద్దు చేసి, విద్యార్థులు నష్టపోకుండా జేఎన్‌టీయూకు అటాచ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురునానక్ కళాశాలకు యునివర్సిటీ గుర్తింపు రాకపోయినప్పటికీ కళాశాలలో విద్యార్థులను చేర్చుకొని వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా జేఎన్‌టీయూకు అటాచ్ చేసి పరీక్షలు రాయించాలన్నారు. అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకున్నందుకు కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

శంకర్‌పల్లి సీఐకి ఏసీపీగా పదోన్నతి



శంకర్‌పల్లి సీఐ ప్రసన్న కుమార్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి సీఐ వి.ప్రసన్న కుమార్‌కు ఏసీపీగా పదోన్నతి లభించింది. ప్రభుత్వం గురువారం సాయంత్రం 141 మంది సీఐలకు పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. అందులో 1998 బ్యాచ్‌కు చెందిన సీఐ ప్రసన్న కుమార్ కూడా ఉన్నారు. ఆయన రెండు నెలల క్రితం శంకర్‌పల్లి సీఐగా బాధ్యతలు చేపట్టారు. పనిచేసిన రెండు నెలల వ్యవధిలోనే సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. ఏసీపీగా పదోన్నతి రావడంపై ప్రసన్న కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

సొప్ప గడ్డి కోస్తూ..

ఇబ్రహీంపట్నం: సొప్ప గడ్డి కోస్తూ ప్రమాదానికి గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మారయ్య కథనం ప్రకారం.. స్థానిక యాదవ బస్తీలోఉండే ఐలమ్మ(34) శుక్రవారం పశువుల కోసం యంత్రం ద్వారా సొప్ప గడ్డి కోస్తోంది. ప్రమాదవశాత్తు ఆమె చీర కొంగు మిషన్‌లో చిక్కుకొని మృత్యువాత పడినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నారు.

ఇంటిముందు నిలిపిన స్కూటీ మాయం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కూటీ మాయమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో నివాసం ఉండే జ్ఞానేందర్‌రెడ్డి తన స్కూటీని (టీఎస్ 08సీఎస్ టీఆర్9194) ఇంటి ముందు రాత్రి పదిగంటల సమయంలో నిలిపి ఉంచాడు. పొద్దున లేచి చూసేసరికి కనిపించలేదు. శుక్రవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'అల్లూరి' చరిత్రను భావి తరాలకు చెప్పాలి

కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

మాదాపూర్: అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవాలని, ఆయన చరిత్రను భావితరాలకు తెలియజెప్పాలని కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని సీసీఆర్టీలో శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 125వ జన్మదినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో భాగంగా సన్నాహక సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం, క్షత్రియ సేవా సమితితో కలిసి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం నుంచి అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నందుకు సమితి సభ్యులను అభినందించారు. ఢిల్లీలోనూ జయంతి ఉత్సవాలు నిర్వహించాలనుందన్నారు. నటుడు కృష్ణ అల్లూరి సీతారామరాజు సినిమాను తీయకపోతే తనలాంటి వారికి ఆయన గొప్పతనం తెలిసేది కాదన్నారు. తన జీవితంలో ఎక్కువ సార్లు అల్లూరి సీతారామరాజు సినిమా చూసినట్లు తెలిపారు. ఆ పేరులోనే త్యాగం, స్ఫూర్తి, సాహసం ఉన్నాయన్నారు. భావితరాలకు కూడా ఆయన గొప్పతనాన్ని తెలియజెప్పేలా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. గిరిజనులను సంఘటితం చేసిన అల్లూరికి దక్కుతుందని, ఆయన పోరాట వీరుడే కాక ఆధ్యాత్మిక వేత్తగా పేర్కొన్నారు. గిరిజనుల జీవితాల్లో అనేక మార్పులను తీసుకువచ్చారన్నారు. మంచి, చెడు వివరించి వారిని సంఘటితం చేశారన్నారు. పోరాటాల్లోనూ నైతిక విలువలు పాటించారని, చెప్పి మరీ దాడి చేసి ఆయుధాలను తీసుకెళ్లే వారన్నారు. అల్లూరి సీతారామరాజు పై కార్టూన్ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి దేశప్రధాని మోదీ, ముగింపు కార్యక్రమాలకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరుకానుండటం సంతోషకరమన్నారు. ఏ గిరిజనుల కోసం ఆయన పోరాటం చేశాడో అదే గిరిజన మహిళ నేడు దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్నారని, ఆయన జయంతి ఉత్సవాలకు హైదరాబాద్ రావడం గర్వకారణమన్నారు. అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సినీనటుడు మురళీమోహన్‌లతో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏలో అవినీతి పెరిగిపోయింది

- మంత్రి శ్రీనివాస్ గౌడ్
- ఎల్‌బీస్టేడియంలో ఘనంగా ఒలింపిక్ రన్



ఒలింపిక్ జ్యోతిని ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అవినీతిలో కూరుకుపోయిందని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీస్టేడియంలో ఒలింపిక్ డే రన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.... హెచ్‌సీఏ అవినీతిమయమైంతదని, అసోసియేషన్ అవకతవకలపై కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. హెచ్‌సీఏ సక్రమంగా పని చేయకపోతే దానిని ప్రభుత్వ పరిధిలోకి తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. 18,200 గ్రామాల్లో క్రీడా మైదానాలు, 70 నియోజకవర్గాల్లో ఇండోర్ స్టేడియాలను నిర్మించామన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ త్వరలో స్టేడియాలను పూర్తి చేస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో క్యాబినెట్ ఆధ్వర్యంలో క్రీడా పాలసీని రూపొందిస్తున్నామని ఈ క్రీడా పాలసీతో క్రీడాకారులకు, క్రీడా సంఘాలు, ఒలిపిక్ అసోసియేషన్లకు లబ్ధి చేకూరుతుందన్నారు. కోచ్‌ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏటా సీఎం కప్ నిర్వహిస్తామని త్వరలో ఒలింపిక్ క్రీడల కోసం సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఒలంపిక్ క్రీడా జ్యోతిని వెలిగించి ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్, నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాలచారి, పాఠశాల మౌలిక వసతుల కల్పన చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, శాసన సభ్యులు హర్షవర్ధన్‌రెడ్డి, క్రీడల పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్‌లతో పాటు పలువురు అర్జునా అవార్డు గ్రహీతలు, క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ పోటీలకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో మొత్తం 13,670 ప్రాజెక్టులు ఏర్పాటు చేయగా అందులో 70 మాత్రమే తుది పోటీలకు ఎంపిక చేశారన్నారు. వాటిలో చేవెళ్ల బాలికలకు చెందిన ప్రాజెక్టులో కాస్ట్ ఫెబిన్ మిషన్ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. టెన్త్ విద్యార్థులు రేవంతి, పూజా, శృతి, శ్రేయతో పాటు గైడ్ టీచర్ అనితలు కలిసి ప్రాజెక్టు ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులను సన్మానించిన ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు